





తెలుగు దినపత్రిక

# వార్త నిర్భయం

సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!

www.vaarhtanirbhayam.com

ఎడిటర్ కాడేపాగు అశోక్

ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ





తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 176 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ శనివారం- 23 - మే - 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,


## బండి భగీరథ్ అరెస్టు విషయంలో రేవంత్ రెడ్డి అలా, బండి సంజయ్ ఇలా



- బండి సంజయ్ లొంగుబాటు అంటే, రేవంత్ రెడ్డి అరెస్టు అంటున్నారని ఆగ్రహం
- ఇద్దరు తోడు దొంగలు కలిసి డ్రామాలు ఆడుతున్నారని విమర్శ
- రేవంత్ రెడ్డికి హైట్ మాత్రమే తక్కువ కాదు బుర్ర కూడా తక్కువ అని ఎద్దేవా

హైదరాబాద్: బండి భగీరథ్ లొంగిపోయాడని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ చెబితే, పోలీసులే అరెస్టు చేశారని

## స్మార్ట్ బోర్డర్' ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

# బంగ్లా, పాక్ సరిహద్దులు ఇక సేఫ్ !

- వచ్చే ఏడాదిలో 'స్మార్ట్ బోర్డర్' ప్రాజెక్టును ప్రారంభించనున్న కేంద్రం
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి



ఢిల్లీ : పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో ఉన్న 6,000 కిలోమీటర్ల సరిహద్దును పటిష్ఠంగా మార్చడానికి కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఆ ప్రాంతాల జనాభా స్వరూపాన్ని మార్చే కుట్రలకు చెక్ పెట్టే విధంగా వచ్చే ఏడాదిలో 'స్మార్ట్ బోర్డర్' ప్రాజెక్టును ప్రారంభించనుంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించారు. దిల్లీలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) నిర్వహించిన వార్షిక రుస్తమ్జీ మెమోరియల్ సమావేశానికి హాజరయ్యారు. సరిహద్దు చొరబాట్లపై జీరో టాలరెన్స్ విధానాన్ని ప్రకటిస్తూ, ప్రతి అక్రమ వలసదారుడిని వెనక్కి పంపడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. "బీఎస్ఎఫ్ ఏర్పడిన 60వ సంవత్సరంలో మేము ఈ స్మార్ట్ బోర్డర్ ప్రాజెక్టును ప్రారంభించనున్నాం. పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దులను అభేద్యంగా మారుస్తామని బీఎస్ఎఫ్ దళాలకు నేను హామీ ఇస్తున్నాను. వచ్చే ఏడాదిలోగా పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల వెంబడి 'బలమైన భద్రతా గ్రిడ్'ను ఏర్పాటు చేయాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది. స్మార్ట్ సరిహద్దుకు సాంకేతికత, డ్రోన్లు, రాడార్లు, స్మార్ట్ కెమెరాలు సహాయపడతాయి. ఒక సమస్యను నియంత్రించడం భద్రత కాదు. దానిని మూలాల నుంచి నిర్మూలించడమే నిజమైన విధానం. బీఎస్ఎఫ్ ఇప్పుడు చొరబాటుకు వ్యతిరేకంగా అదే దృఢ సంకల్పంతో ముందుకు సాగాలి." దేశంలోకి చొరబడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి, వారిని భారతదేశం వెలుపలికి పంపిస్తామని

## భారత్, సైప్రస్ సంబంధాలు

# వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి

- ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్- ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్న అనుబంధం
- ప్రధాని మోదీ- భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం- భారత్‌కు మద్దతు

### కొత్త వేగాన్ని అందించడానికి రెడీ మోదీ



ఢిల్లీ : భారత్, సైప్రస్‌లు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్, సైప్రస్ అనుబంధం కాలపరీక్షలో పదేపదే నిలుస్తూ వచ్చిందని ఆయన తెలిపారు. ఇప్పుడు భారత్-సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుతో ఇరుదేశాల సంబంధాలకు కొత్త ఆశయాలు, కొత్త వేగాన్ని అందించడానికి సిద్ధమయ్యామని చెప్పారు. మే 20 నుంచి భారత పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, శుక్రవారం దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ఈ ద్వైపాక్షిక సమావేశం అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో భారత ప్రధాని ప్రసంగించారు. గత దశాబ్ద కాలంలో భారత్‌లోకి సైప్రస్ పెట్టుబడులు దాదాపు రెట్టింపు అయ్యాయని, ఇది ఇరుదేశాల మధ్య పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనమని నరేంద్ర మోదీ తెలిపారు. ఇటీవలె భారత్- యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అనేది రాబోయే రోజుల్లో భారత్ - సైప్రస్‌లకు కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మిగతా..2లో

## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం



- ఫార్మా సిటీని మళ్లీ పునరుద్ధరిస్తామని వెల్లడి
- అమెరికా పర్యటనలో వ్యాఖ్యలు
- 16 వేల ఎకరాల భూసేకరణ పూర్తైందని వెల్లడి
- కేంద్ర పర్యావరణ శాఖ అనుమతులూ వచ్చాయన్న మాజీ మంత్రి
- వేరే అవసరాలకు వాడితే భూములు వెనక్కి ఇవ్వాలని డిమాండ్

హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్ట్‌పై బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో

## నిమ్స్‌లో 2000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్.. వైద్య బృందానికి

# సీఎం రేవంత్ అభినందనలు

- కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.
- హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కిడ్నీ మార్పిడిలలో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది.



హైదరాబాద్, మే 22: కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో అరుదైన మైలురాయిని అందుకున్న నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కిడ్నీ మార్పిడి చికిత్సలో దేశంలోనే అరుదైన రికార్డు నమోదు చేసింది. నిమ్స్ యూరాలజీ విభాగం ఇప్పటివరకు 2,000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ పూర్తి చేసింది. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో దక్షిణ భారత దేశంలో నిమ్స్ నంబర్ వన్‌గా నిలిచింది. దేశంలో కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్‌లో గుజరాత్‌లోని ఐకేడీఆర్‌సీ మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో లూథియానా క్రిస్టియన్ కాలేజీలో ఉండగా.. నిమ్స్ మూడో స్థానంలో నిలిచింది. మిగతా..2లో

## నిందితుడిని దాచి

# ఉంచిన నేరం రేవంత్‌దే



- బండి -రేవంత్ అనుబంధం వల్లనే ఆడబిడ్డకు అన్యాయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, మే 22 :తనకు అన్యాయం జరిగిందని ఓ ఆడబిడ్డ బయటకు వస్తే ఆ కుటుంబాన్ని బెదిరించి కౌంటర్ కేసు పెట్టించి నిందితుడిని తొమ్మిది రోజులు కాపాడింది ముమ్మాటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తనకు అన్యాయం జరిగిందని మైనర్ బాలిక తల్లిదండ్రులతో పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి తీవ్ర ఆవేదనకు గురిచేసింది రాష్ట్ర ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. నిందితుడికి బెయిల్ ఇవ్వనని హైకోర్టు తెగేసి చెప్పడం, రాష్ట్రంలోని ప్రతీ ఆడబిడ్డ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోయడంతోనే దిక్కులేని పరిస్థితుల్లో నిందితుడిని అరెస్టు చేశారన్నారు. రాష్ట్ర హోం శాఖకు బాధ్యుడిగా ఉన్న ముఖ్యమంత్రి.. ప్రధానమంత్రి పర్యటన వల్ల పోలీసులంతా బిజీ ఉన్నారని అడ్డగోలు సాకులు చెప్పేందుకు సిగ్గుపడాలన్నారు. అత్యంత సున్నితమైన ఈ విషయంలో పార్టీ తరఫున మౌనంగా ఉన్నామని, ఏనాడూ రాజకీయం చేయలేదని కేటీఆర్ తెలిపారు.

## ఏపీ అటవీ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష..



ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

అమరావతి: ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ నెలలో నిర్వహించనున్న విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారీ కార్యక్రమంపై అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో 2.5 కోట్ల విత్తన బంతులను పంపిణీ చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. మిగతా..2లో

## ఇజ్రాయెల్ కోసం అమెరికా ఆయుధాల ఖాళీ! మిత్రదేశాల్లో మొదలైన యుద్ధ భయం..?

### మిత్రదేశాల్లో మొదలైన యుద్ధ భయం..?



ఢిల్లీ : ఇరాన్తో జరుగుతున్న భీకర యుద్ధం మధ్య అంతర్జాతీయంగా ఒక సంచలన నివేదిక బయటకు వచ్చింది. ఇరాన్ దాడుల నుండి ఇజ్రాయెల్ను రక్షించే క్రమంలో అమెరికా తన క్షిపణి నిధులు (మిస్సైల్ స్టాక్) సగానికి పైగా కోల్పోయిందని, అదే సమయంలో ఇజ్రాయెల్ మాత్రం తన స్వంత ఆయుధ సంపత్తిని కాపాడుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామం ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన అమెరికా సైన్యానికి సరికొత్త సవాలుగా మారింది. ప్రముఖ అమెరికన్ వార్తాపత్రిక 'ది వాషింగ్టన్ పోస్ట్' కథనం ప్రకారం.. ఇరాన్తో ఇటీవల జరిగిన ఘర్షణల్లో ఇజ్రాయెల్ వైమానిక రక్షణ బాధ్యతను సింహభాగం అమెరికాయే మోసింది. దీనివల్ల అమెరికాకు చెందిన అత్యంత అధునాతన మిస్సైల్ డిఫెన్స్ ఇంటర్సెప్టర్ల నిల్వలు గణనీయంగా క్షీణించాయి. మిగతా..2లో

## ప్రకృతి వ్యవసాయంతో అద్భుతాలు చేస్తున్న ద్వారకానాథరెడ్డిని అభినందించిన లోకేష్



- కడప జిల్లాలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి లోకేష్
- సమీకృత సేంద్రియ సాగుతో సక్సెస్ అయిన రైతు ద్వారకానాథ రెడ్డితో భేటీ
- జీరో బడ్జెట్ నేచరల్ ఫార్మింగ్ సీఎం చంద్రబాబు లక్ష్యమని వెల్లడి
- రసాయన ఎరువులు వీడి సేంద్రియ సాగు వైపు రావాలని రైతులకు పిలుపు
- ఆదర్శ రైతు కుటుంబాన్ని అభినందించి, ప్రభుత్వ అండ ఉంటుందని హామీ

## రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై

# సీఎం చంద్రబాబు సమీక్ష

- చలివేంద్రాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశం
- తీవ్ర ఉష్ణోగ్రతలున్న ప్రాంతాల్లో స్థానికంగా సెలవులు ప్రకటించాలని సూచన
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని స్పష్టం
- ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం



అమరావతి : రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వడగాల్పుల తీవ్రత దృష్ట్యా ఏపీలోని కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో, చేపట్టాల్సిన సన్నద్ధత చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. హీట్‌వేవ్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన చోట్ల టెంట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటి ద్వారా ప్రజలకు చల్లని నీరు, మజ్జిగ, మిగతా..2లో

## జగన్ ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు'

# గుర్తుకొస్తున్నాడు



- తమ కుటుంబంలో జరిగిన మరణాలన్నీ చంద్రబాబు హయాంలోనే జరిగాయన్న అచ్చెన్నాయుడు
- వైఎస్ మరణం వెనుక రిలయన్స్ ఉందని చెప్పినవారు ఇప్పుడు చంద్రబాబుపై పడుతున్నారని మండిపాటు
- అధికారంలో ఉన్న కాలంలో వివేకా హంతకులను ఎందుకు పట్టుకోలేకపోయారని ప్రశ్న

అమరావతి : వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు తనదైన శైలిలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైఎస్ కుటుంబంలో జరిగిన మరణాలన్నీ మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## రాష్ట్రంలో ఎండల తీవ్రత, వడగాల్పులపై సీఎం చంద్రబాబు సమీక్ష

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎండల తీవ్రత అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను బట్టి స్థానికంగా సెలవులు ప్రకటించే విషయాన్ని పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎండల తీవ్రత, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లు మీడియా సమావేశాలు నిర్వహించాలని నిర్దేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు విపత్తు నిర్వహణ, వైద్యారోగ్య, పురపాలక, పంచాయితీరాజ్ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిమ్స్‌లో 2000 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్.. వైద్య బృందానికి సీఎం రేవంత్ అభినందనలు

### ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్న రైతులు: కేటీఆర్

ఈ అరుదైన మైలురాయిని సాధించి కిడ్నీ బాధితులకు విశేష సేవలు అందించిన నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ 2,000 మందిలో 1,900 మంది అంటే 95% మంది రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా కిడ్నీ మార్పిడి చేయించుకోవటం విశేషం. 2023 జనవరి నుంచి గడిచిన మూడేళ్ల నాలుగు నెలల్లోనే.. 500 కిడ్నీ మార్పిడిలు చేసి నిమ్స్ రికార్డు నెలకొల్పింది.

## ఏపీ అటవీ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష..

వీటి తయారీ కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని అన్నారు. అందుకు అన్ని వర్గాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ ఏడాది వర్షాకాల సీజన్‌ను పూర్తిగా వినియోగించుకోవాలని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగించాలని సూచించారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ సాంకేతికతను వినియోగించడం, చేతులతో నాటడం చేయాలని ఆయన పేర్కొన్నారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడం, స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం ఈ హరిత ఉద్యమ ప్రధాన లక్ష్యమని పవన్ చెప్పుకొచ్చారు. మనం చల్లే ప్రతి విత్తన బంతి.. మన భవిష్యత్తుకు ఇచ్చే ఒక నమ్మకమైన హామీగా మారాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే తరాల కోసం ఆంధ్రప్రదేశ్‌ను మరింత పచ్చగా, ఆరోగ్యకరంగా, సుస్థిరంగా మార్చేందుకు మనమంతా చేతులు కలపాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## భారత్, సైప్రస్ సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి

దీని ఊతంతో రాబోయే ఐదేళ్లలో పెట్టుబడులను రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ఇరుదేశాలు పెట్టుకున్నాయని చెప్పారు.

### ఈ విభాగాల్లో ఎంఓయూలు

భారత్, సైప్రస్‌లు డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ నిర్వాహక వ్యవస్థలు, రీసెర్చ్ హబ్‌లు వంటి విభాగాలతో ముడిపడిన పలు అవగాహనా ఒప్పందాల(ఎంఓయూ)పై సంతకాలు చేశాయని ప్రధాని వెల్లడించారు. సంస్థాగత సహకారాలు, విద్యార్థి మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపైనా ఎంఓయూలు కుదిరాయన్నారు. ఇరుదేశాల మధ్య చట్టబద్ధమైన వలసలను ప్రోత్సహించే, అక్రమ వలసలను అరికట్టే ఒప్పందం ఖరారుకు దృఢమైన ఏకాభిప్రాయాన్ని సాధించడంపైనా ఫోకస్ పెట్టాలని నిర్ణయించినట్లు మోదీ తెలిపారు. భారత్– సైప్రస్ మధ్య రాకపోకలు సాగించే వృత్తి నిపుణుల హక్కుల పరిరక్షణకు త్వరలోనే ఒక సామాజిక భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకోవాలని నిర్ణయించామన్నారు.

### ఉగ్రవాదం కట్టడికి జాయింట్ వర్కింగ్ గ్రూప్

"ఉగ్రవాదం కట్టడి కోసం ఒక జాయింట్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసే అంశంపై భారత్– సైప్రస్ మధ్య ఎంఓయూ కుదిరింది. తీవ్రవాద భావజాలం, సరిహద్దు ముప్పులను ఎదుర్కోవడానికి ఈ జాయింట్ వర్కింగ్ గ్రూప్ పనిచేస్తుంది. సైబర్ భద్రత, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధక నెట్‌వర్క్‌ల బలోపేతం, లక్షిత రక్షణ విస్తరణలలోనూ ఇరుదేశాలు కలిసి పనిచేస్తాయి. భారత్, సైప్రస్‌ల మధ్య స్నేహం బలమైనది. ఇది భవిష్యత్ దృష్టితో కూడుకున్నది. ప్రజాస్వామ్యం, చట్టబద్ధమైన పాలన వంటి విలువలకు కట్టుబడి ఉండాలనే ఉమ్మడి నిబద్ధతపై మా భాగస్వామ్యం ఆధారపడి ఉంది. మేం అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను ప్రగాఢంగా గౌరవిస్తాం. ఈ సూత్రాలను పరిరక్షించడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని ప్రధాని మోదీ తెలిపారు.

### భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం- భారత్‌కు మద్దతు : సైప్రస్

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు తమ మద్దతు ఉంటుందని సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ప్రకటించారు. నేటి ప్రపంచ వాస్తవికతలను ప్రతిబింబించేలా భద్రతా మండలి నిర్మాణంలో మార్పులు జరగాలన్నారు. ప్రపంచ వ్యవహారాల్లో పెరుగుతున్న భారత్ పాత్రకు కూడా తమ మద్దతు ఉంటుందని ఆయన తేల్చి చెప్పారు. సైప్రస్‌ను తిరిగి ఏకీకృతం చేసే ప్రయత్నాలకు భారత్ అందిస్తున్న దీర్ఘకాలిక మద్దతును తాము ఎంతగానో గౌరవిస్తామన్నారు. సైప్రస్ గణతంత్ర రాజ్య స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతకు స్థిరమైన మద్దతును అందిస్తున్న భారత్‌కు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ధన్యవాదాలు తెలియజేశారు.

### ప్రధాని మోదీ సైప్రస్ పర్యటనతో అద్భుత వేగం

"గత ఏడాది మోదీ సైప్రస్ పర్యటనతో ఇరుదేశాల భాగస్వామ్యం అద్భుతమైన వేగంతో, దృఢ నిశ్చయంతో ముందుకు సాగింది. ఈ భాగస్వామ్యం ఇప్పటికే భద్రత, రక్షణ, సాంకేతికత, ఆవిష్కరణలు, సముద్ర సహకారం, విద్య, ఆర్థిక అనుసంధానం వంటి కీలక రంగాల్లో స్పష్టమైన ఫలితాలను ఇస్తోంది. మౌలిక సదుపాయాలు, నౌకా రవాణా, ఆర్థిక సహకారం వంటి కీలక రంగాల్లో సహకారం కోసం నేటి సమావేశంలో ఒక జాయింట్ వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాం" అని సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ వెల్లడించారు.

## బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తాం

ఉన్న ఆయన అక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### భూములను రైతులకు ఇచ్చేయాలి

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'ఫార్మా సిటీ'ని మళ్లీ పునరుద్ధరిస్తామని హరీశ్ తెలిపారు. ఫార్మా సిటీ కోసం తాము 16 వేల ఎకరాల భూసేకరణ చేశామన్నారు. దానికి కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అన్ని క్లియరెన్సులు కూడా వచ్చాయని వెల్లడించారు. ఏ ఉద్దేశంతోనైతే రైతుల దగ్గర నుంచి భూములు తీసుకున్నామో దానికి భిన్నంగా భూమిని వేరే అవసరాల కోసం వాడితే ఆ ల్యాండ్‌ను తిరిగి రైతులకే ఇచ్చేయాలని చట్టం చెబుతోందని తెలిపారు. ఫార్మా సిటీని రద్దు చేసి వేరే ప్రాజెక్ట్ పెడితే చట్ట ప్రకారం ఆ భూములను రైతులకు వెనక్కి ఇచ్చేయాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని విమర్శించారు.

### కోర్టులో ప్రభుత్వం అబద్ధాలు

ఫార్మా సిటీని రద్దు చేయడం లేదని రేవంత్ సర్కార్ హైకోర్టులో కేసు విచారణ సందర్భంగా అబద్ధాలు చెప్పిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఓవైపు కోర్టుకు ఫార్మా సిటీ కొనసాగిస్తామని చెబుతూనే మరోవైపు ఫ్యూచర్ సిటీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. ఫార్మా సిటీ ద్వారా లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని చట్ట ప్రకారం దాన్నే కొనసాగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## బండి భగీరథ్ అరెస్టు విషయంలో రేవంత్ రెడ్డి అలా, బండి సంజయ్ ఇలా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆయన లొంగుబాటు అంటే, ఈయన అరెస్టు అని చెప్పడం విడ్డూరమని అన్నారు. ఇద్దరు తోడు దొంగలని, వారు కలిసి డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి హైట్ ఒక్కటే తక్కువ అనుకున్నానని, కానీ బుర్ర కూడా తక్కువేనని ఎద్దేవా చేశారు. బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారని, కానీ హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాలేదని కేటీఆర్ తెలిపారు. ఒక అమ్మాయికి అన్యాయం జరిగితే ఆ అమ్మాయి వివరాలు బయటపెట్టింది బీజేపీవారే అన్నారు. పేట్ బషీరాబాద్‌లో 15 మందిపై కేసులు నమోదయ్యాయని, వారంతా బీజేపీవారే అన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటనకు వచ్చి చావు కబురు చల్లగా చెప్పారని విమర్శించారు. రైతులు యూరియా ఉపయోగించడం తక్కువ చేయాలని, ప్రజలు బంగారం కొనుగోలు తగ్గించాలని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం వచ్చే సీజన్‌లో కూడా రైతులకు ఇబ్బంది తప్పదని అన్నారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగులు దొరకడం లేదు కానీ గన్‌లు మాత్రం బాగా దొరుకుతున్నాయని కేటీఆర్ విమర్శించారు.

## జగన్ ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' గుర్తుకొస్తున్నాడు

మొదటి పేజి తరువాయి

టీడీపీ, చంద్రబాబు హయాంలోనే జరిగాయంటూ జగన్ చేసిన ఆరోపణలను కొట్టిపారేసిన ఆయన.. జగన్ ప్రవర్తన చూస్తుంటే 'అపరిచితుడు' సినిమా పాత్ర గుర్తుకొస్తోందని ఎద్దేవా చేశారు. జగన్ తాత రాజారెడ్డిని ఎందుకు హత్య చేశారో, ఆనాటి వైఎస్ కుటుంబ అరాచకాలను బాధితుడు పార్థసారథిరెడ్డి స్వయంగా వివరించారని అచ్చెన్న గుర్తుచేశారు. రాజారెడ్డి హత్య కేసులో ఉన్న వ్యక్తి ఇవాళ వైసీపీలోనే కొనసాగుతుండటం జగన్ ద్వంద్వ నీతికి నిదర్శనమన్నారు. ఇక అసెంబ్లీలో చంద్రబాబు మాట్లాడిన రెండు రోజులకే వైఎస్సార్ హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారంటూ జగన్ చేస్తున్న ప్రచారం సిగ్గుమాలిన చర్య అని మండిపడ్డారు. ఆనాడు తిరుమల వేంకటేశ్వర స్వామికి కీడు తలపెడితే మంచి జరగదని మాత్రమే చంద్రబాబు అన్నారని, గతంలో వైఎస్సార్ మరణం వెనుక 'రిలయన్స్' ఉందన్న వారే ఇప్పుడు చంద్రబాబుపై పడుతున్నారని ధ్వజమెత్తారు. అలాగే బాబాయ్ వైఎస్ వివేకానందరెడ్డి మరణాన్ని మొదట గుండెపోటు అని నమ్మించి, ఆపై గొడ్డలితో నరికి చంపిన చరిత్ర వారిదేనని.. అందుకే వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని పిలుస్తున్నామని స్పష్టం చేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా వివేకా హంతకులను ఎందుకు పట్టుకోలేకపోయారో జగన్ సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు నిలదీశారు.



## స్మార్ట్ బోర్డర్' ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ - బంగ్లా, పాక్ సరిహద్దులు ఇక సేఫ్ !

మొదటి పేజి తరువాయి

అమిత్ షా మరోసారి స్పష్టం చేశారు. చొరబాటు, పశువుల అక్రమ రవాణా మార్గాలను గుర్తించి, వాటిని అరికట్టేందుకు రాష్ట్ర పోలీసులు, జిల్లా కలెక్టర్లు, గ్రామ అధికారులతో నేరుగా సమన్వయం చేసుకుంటూ తమ నిఘా వ్యవస్థను విస్తరించాలని బీఎస్ఎఫ్‌ను కోరారు. బంగాల్, అసోం, త్రిపుర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటే ఈ భద్రతా వ్యవస్థను సులభతరం చేసుకోవచ్చని అన్నారు. ఈ మేరకు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో హోం మంత్రిత్వ శాఖ త్వరలో సమావేశం కానుందని వివరించారు. గతంలో ప్రకటించిన ఉన్నత స్థాయి జనాభా మిషన్‌ను కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందని తెలిపారు. "ఎలాంటి ఆంక్షలు లేకుండా ఏళ్ల తరబడి కొనసాగుతున్న చొరబాట్లను అడ్డుకోవడానికి ఇప్పుడు సమయం ఆసన్నమైంది. నక్సల్ రహిత ఉద్యమాన్ని చేపట్టవద్దని చాలా మంది రిటైర్డ్ పోలీసు అధికారులు నాతో చెప్పారు. ప్రధానమంత్రితో కూడా ఇదే విషయాన్ని చెప్పారు. కానీ భారత ప్రభుత్వం తన నిర్ణయంపై దృఢంగా నిలిచింది. ఐదు దశాబ్దాల నాటి సమస్య ఇప్పుడు ముగింపు దశకు చేరుకుంది. భారతదేశం ఇప్పుడు నక్సల్ రహిత దేశంగా మారింది. ఇప్పుడు చొరబాట్లను ఎదుర్కోవడంలో దీూఖీ కూడా అదే సంకల్పంతో ముందుకు సాగాలి. ప్రధానమంత్రి 'హై పవర్ డెమోగ్రఫీ మిషన్'ను ప్రారంభించారు. దీనికి సంబంధించిన వివరాలు మరికొన్ని రోజుల్లో ప్రకటిస్తాం. ఈ పథకం ద్వారా గుర్తించిన కీలక ప్రదేశాలు దీూఖీ, సరిహద్దు భద్రతా దళ సిబ్బందికి అందుబాటులోకి వస్తాయి." "బీఎస్ఎఫ్ ఏర్పడిన నాటి నుంచి యావత్ దేశానికి సంపూర్ణ భద్రతను కల్పిస్తూ, దేశాన్ని ఆందోళన రహితంగా మార్చింది. 1965లో కేవలం 25 బెటాలియన్లతో ప్రారంభమైన బీఎస్ ఎఫ్ , ఇప్పుడు 27 లక్షల మంది సిబ్బందితో బలమైన దళంగా ఎదిగింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సరిహద్దు రక్షక దళంగా అవతరించడం ఎంతో గర్వకారణం. దేశంలోని అత్యంత కష్టతరమైన, సున్నితమైన రెండు సరిహద్దులను కాపాడుతూ బీఎస్ఎఫ్ ఎన్నడూ వెనుకాడలేదు. ఎలాంటి సవాళ్లు ఎదురైనా చివరకు శత్రువు ఓటమిని చవిచూశాడు. మీరు ఎప్పుడూ భారతదేశాన్ని తలవంచనివ్వలేదు. జాతీయ భద్రత అనే ఈ బృహత్ నిర్మాణం మీ అకుంఠిత ధైర్యం, వీరత్వం, అత్యున్నత త్యాగాలపైనే దృఢంగా నిలబడి ఉంది." అని బీఎస్ ఎఫ్ ను అమిత్ షా కొనియాడారు.



## ప్రకృతి వ్యవసాయంతో అద్భుతాలు చేస్తున్న ద్వారకానాథరెడ్డిని అభినందించిన లోకేష్

మొదటి పేజి తరువాయి

అమరావతి : రసాయన ఎరువుల వాడకంతో దెబ్బతింటున్న భూసారాన్ని కాపాడుతూ, పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవాలంటే రైతులు సేంద్రియ సాగు వైపు మళ్లాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమైన 'జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్' విధానాన్ని క్షేత్రస్థాయిలో ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. కడప జిల్లాలో తన రెండు రోజుల పర్యటనలో భాగంగా, జమ్మలమడుగు నియోజకవర్గంలోని ముద్దనూరు మండలం పెనికలపాడు గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సమీకృత సేంద్రియ సాగు పద్ధతులతో ఆదర్శంగా నిలుస్తున్న రైతు మునగాల ద్వారకానాథ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులతో లోకేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న మంత్రికి రైతు ద్వారకానాథరెడ్డి, ఆయన అర్ధాంగి రాఘవేంద్రవతి సాదరంగా స్వాగతం పలికారు.

### 17 ఎకరాల్లో సమీకృత సేద్యం.. ఆదర్శంగా నిలుస్తున్న రైతు కుటుంబం

పెనికలపాడు గ్రామానికి చెందిన మునగాల ద్వారకానాథరెడ్డి, ఆయన సోదరుడు రమణారెడ్డి గత ఐదేళ్లుగా తమ ఉమ్మడి కుటుంబానికి చెందిన 17 ఎకరాల పొలంలో ప్రకృతి సేద్యం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. పంటల సాగుతో పాటు పశు పోషణ, కోళ్లు, గొర్రెలు, చేపల పెంపకాన్ని అనుసంధానం చేసి సమీకృత సేంద్రియ వ్యవసాయం ద్వారా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు. తమ వ్యవసాయ క్షేత్రంలో మామిడి, బత్తాయి, ఉసిరి, కొబ్బరి, జామ, నేరేడు, మునగ, రామాఫలం, సీతాఫలం వంటి పండ్ల తోటలతో పాటు 250 నాటుకోళ్లు, 60 పొట్టేళ్లు, చేపల పెంపకాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రైతు ద్వారకానాథ రెడ్డితో మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం వైపు రావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామానికి చెందిన 70 ఏళ్ల సేంద్రియ రైతు లక్ష్మీనారాయణను స్ఫూర్తిగా తీసుకుని ఈ మార్గంలోకి వచ్చామని ద్వారకానాథరెడ్డి వివరించారు. తొలినాళ్లలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా, వ్యవసాయ అధికారుల ప్రోత్సాహంతో నిలదొక్కుకున్నామని తెలిపారు. తిరుపతిలో సేంద్రియ సాగుపై ప్రత్యేక శిక్షణ ఇప్పించారని, తమకు బయో రీసెర్చ్ సెంటర్ కూడా కేటాయించారని చెప్పారు. పొలంలోనే సహజ ఎరువులు, 32 రకాల జీవ వైవిధ్య విత్తనాలను తయారు చేసుకుంటున్నామని, దీనివల్ల రసాయన ఎరువులు, పురుగుమందుల అవసరమే లేకుండా పోయిందని అన్నారు. ఒక్క దేశవాళీ ఆవుతో 20 ఎకరాల వరకు సేంద్రియ సాగు చేయవచ్చని, 250 నాటుకోళ్ల పెంపకం వల్ల పొలంలో కలుపు తీసే పని, పురుగుల బెడద తప్పిందని వివరించారు. కేవలం మామిడి తోటల ద్వారానే ఏటా రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఆదాయం వస్తోందని తెలిపారు. ప్రభుత్వ సహకారం మరింత లభిస్తే ప్రకృతి వ్యవసాయంలో ఇంకా అద్భుతాలు సాధించగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### ప్రభుత్వం అండగా ఉంటుంది: మంత్రి లోకేష్

రైతు అనుభవాలను విన్న మంత్రి లోకేష్ మాట్లాడుతూ, రసాయనాల మితిమీరిన వాడకం వల్ల రైతులకు పెట్టుబడి భారం పెరగడమే కాకుండా భూసారం కూడా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రభుత్వం జీరో బడ్జెట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందని, ఇందుకు కేంద్రం కూడా సహకరిస్తోందని తెలిపారు. చిరుధాన్యాల సాగును కూడా ప్రోత్సహిస్తున్నామని, రాయలసీమలో బిందు సేద్యానికి, గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ద్వారకానాథ రెడ్డి వంటి ఆదర్శ రైతులను చూసి స్థానిక రైతులు స్ఫూర్తి పొందాలని, సేంద్రియ సాగును ప్రోత్సహించేందుకు రైతుల మధ్య అనుసంధానం పెంచాల్సిన అవసరం ఉందని లోకేష్ అభిప్రాయపడ్డారు. అనంతరం మంత్రి లోకేష్ వ్యవసాయ క్షేత్రం మొత్తం కలియతిరిగి మామిడి, బత్తాయి, మునగ తదితర పంటలను పరిశీలించారు. క్షేత్రంలో నిర్మించిన 32 లక్షల లీటర్ల సామర్థ్యమున్న నీటి కుంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమీకృత సేంద్రియ సాగుతో స్థిరమైన ఆదాయం పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్న ద్వారకానాథ రెడ్డి కుటుంబాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించి, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సేంద్రియ పద్ధతిలో పండించిన మామిడి పండును రుచి చూసిన లోకేష్, దాని సహజమైన రుచిని ప్రశంసించారు. రైతు కుటుంబం మంత్రికి మామిడి పండ్ల బుట్టను బహుమతిగా అందించింది. అనంతరం వారితో కలిసి మంత్రి ఫోటోలు దిగారు.

## నిందితుడిని దాచి ఉంచిన నేరం రేవంత్‌దే

మొదటి పేజి తరువాయి

కానీ ముఖ్యమంత్రి తమపై విమర్శలు చేసిన తర్వాతనే తప్పని పరిస్థితుల్లో మాట్లాడాల్సి వస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి పోక్సో కేసు నిందితుడిని తొమ్మిది రోజులు దాచిపెట్టిన సందర్భం ఎక్కడైనా ఉన్నదా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు, రేవంత్ రెడ్డికి ఉన్న అనుబంధం వల్లనే ఇద్దరూ కలిసి నిందితుడిని తొమ్మిది రోజులు దాచి ఉంచారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి సన్నిహితుడి హాస్పిటల్‌లో తొమ్మిది రోజుల పాటు దాచిపెట్టారన్న వార్తలు వస్తున్నాయని, దీనిపై ప్రభుత్వం విచారణ చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ కొడుకుతో తనకు సంబంధం లేదని కోర్టు ద్వారా ఆర్డర్ తెచ్చుకున్నాడని, అంతటి దుర్మార్గమైన పరిస్థితి ఏ తండ్రికీ రావద్దని కేటీఆర్ అన్నారు. ఒకవైపు తన కొడుకుతో సంబంధం లేదని చెప్తూనే తిరిగి తానే పోలీసులకు అప్పజెప్పానని అనడం ఏంటో సమాధానం చెప్పాలన్నారు. పోక్సో కేస్ నిందితులు తొమ్మిది రోజులు తప్పించుకోలేరని, కేంద్ర మంత్రి కొడుకు కావడం, ముఖ్యమంత్రి అండదండలు ఉండడం వల్లనే తప్పించుకున్నాడని కేటీఆర్ అన్నారు. ఈ అంశంలో పార్టీ జనరల్ సెక్రటరీ ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ అద్భుతంగా ప్రభుత్వాన్ని, మీడియాను అలర్ట్ చేశారని అభినందించారు. అలాంటి ప్రవీణ్ కుమార్ గురించి అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి మాటల్ని కేటీఆర్ ఖండించారు. రేవంత్ రెడ్డి లాంటి దొంగ.. దొంగలను ఎలా పట్టుకోవాలో పోలీసులకు చెప్పినట్లు వచ్చిన వార్తలపై ఎద్దేవా చేశారు. ఈ కేసు విషయంలో హనీ ట్రాప్ అంటూ అడ్డగోలు వార్తలు రాసిన మీడియా, రాయించిన వ్యక్తులు ఎవరో సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌లు మీడియా కార్యాలయాలకు ఫోన్ చేసి కాళ్లావేళ్లా పడి వార్తలు రాకుండా ఆపింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ ఆడబిడ్డలకు అన్యాయం జరిగినా కొట్లాడింది తామే అని, అది లగచర్ల మొదలుకొని అనేక అంశాల్లో తమ పార్టీ తరఫున కొట్లాడుతున్నామని చెప్పారు. బండి సంజయ్‌తో తనకు ఎలాంటి పంచాయితీ లేదని, ఆయన తన తండ్రి గురించి ఇష్టారీతి మాట్లాడినా ఏ రోజూ తాను స్పందించలేదని కేటీఆర్ తెలిపారు. ఈ రోజు కూడా బండి సంజయ్‌ను ఏమనడం లేదని, కేవలం నేరస్థుడు ఎవడైనా నేరస్థుడే అనే ఆలోచనతోనే మాట్లాడుతున్నామని అన్నారు. పోక్సో కేసు విషయంలో జరుగుతున్న అన్యాయంపైన ప్రశ్నిస్తే మా బావమరిది ఇంటిపైన డ్రగ్స్ దాడి జరిగింది అంటూ మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి కేసు ఎందుకు పెట్టడం లేదు అని, దమ్ముంటే కేసు పెట్టి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

### పంట కొనుగోళ్ళపై శ్వేతపత్రం విడుదల చేయాలి

పంట కొనుగోళ్లపై పంటల వారీగా లెక్కలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చెప్పినట్లు 80 శాతం కొనుగోళ్ళు పూర్తయ్యాయని నిరూపిస్తే ఏ శిక్షకైనా తాము సిద్ధమని సవాలు విసిరారు. అన్నదాతల పరిస్థితిపైన, పంట కొనుగోళ్ళ సంక్షోభంపైన తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పంట కొనుగోళ్ళ సంక్షోభం తీవ్రంగా ఉన్నదని, దీన్ని పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అవాస్తవాలు చెప్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో స్వయంగా పర్యటించిన తాను కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న రైతన్నల దుస్థితిని చూసిన తర్వాత ప్రభుత్వానికి నిన్న బహిరంగ లేఖ రాస్తే ముఖ్యమంత్రితోపాటు మంత్రి అబద్ధాలు, అటెన్షన్ డైవర్షన్ ముచ్చట్లు చెప్పారని కేటీఆర్ మండిపడ్డారు. కనీసం రేపు జరిగే కేబినెట్ సమావేశంలోనైనా అత్యంత కీలకమైన ఈ పంట కొనుగోళ్ళ సంక్షోభంపై చర్చించాలని, రైతన్నల కష్టాలే ఏకైక ఎజెండాగా రేపటి ఆ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు అన్నదాతల ఆత్మహత్యలపైన, మరణాలపైన ప్రభుత్వానికి సమాచారం ఇస్తే సివిల్ సప్లైస్ మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా ఎవరూ చనిపోలేదని బుకాయిస్తున్నదన్నారు. ప్రభుత్వానికి అవసరమైతే మరణించిన రైతన్నల వివరాలను అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారని తెలిపారు. ఆరుగాలం పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తరలిస్తే కనీసం వాటిని కాంటా పెట్టడం లేదని, కాంటా పెట్టిన సందర్భంలోనూ భారీగా తరుగు తీసి దోపిడీకి గురిచేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో కూడా రైతన్నలు పంట కొనుగోళ్ళపై నిరసన తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు. గన్నీ బ్యాగుల నుంచి మొదలుకొని సుతలి దారం వరకు ప్రతి అంశంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగులు దొరకడం లేదు కానీ గన్నులు మాత్రం విచ్చలవిడిగా దొరుకుతున్నాయంటూ ఇటీవలి దాడులు, అరాచకాలను కేటీఆర్ ప్రస్తావించారు. ప్రతిపక్షంగా బీఆరఎస్ ఇస్తున్న సమాచారాన్ని, సలహాలను తీసుకుని పంట కొనుగోలు సంక్షోభాన్ని గుర్తించాలని, మొద్దు నిద్ర నుంచి మేల్కోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్నాం కాబట్టి కింద ఉన్న సమస్యను పట్టించుకోము, ఎవరు చెప్పినా వినము అనే మూర్ఖత్వంతో వ్యవహరించవద్దని కేటీఆర్ సూచించారు. పంట కొనుగోళ్లు 80 శాతం పూర్తయ్యాయి అని ముఖ్యమంత్రి, 50 శాతం పూర్తయ్యాయి అని మంత్రులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని, క్షేత్రస్థాయిలో కనీసం 30 శాతం కొనుగోళ్ళు కూడా పూర్తి కాలేదని కేటీఆర్ అన్నారు. పదేళ్ళు దేశానికి అన్నపూర్ణగా వెలుగొందిన రాష్ట్రం ఈ రోజు రైతన్నల కన్నీళ్ళతో తల్లడిల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక యూరియా దొరకదు, రైతుబంధు దొరకదు, రుణ మాఫీ కాదు.. చివరకు పండించిన పంట అమ్ముకుందామంటే కూడా సౌకర్యాలు లేవ–ని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలు బుకాయింపులు, బెదిరింపులు, అబద్ధాలతో కాలం వెళ్లబుచ్చక ఉన్న సంక్షోభాన్ని గుర్తించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలుగు జాతీయ వార్తలు, ప్రత్యేక కథనాలు, ట్రెండింగ్ వీడియోలు కోసం ౹ాఖ్ఝఖ్ఘతీఖ్ఞ వెబ్‌సైట్ ను సందర్శించండి. తాజా అప్‌డేట్స్ కోసం మా ఛానల్ ను ఫాలో కండి.. అలాగే మా ప్రజాతంత్ర, యూట్యూబ్ చానల్ ను సబ్ స్క్రైబ్ చేసుకోండి.. మీ అభిప్రాయాన్ని కామెంట్ రూపంలో పంచుకోండి. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో షేర్ చేయడం మర్చిపోవద్దు.


## ఇజ్రాయెల్ కోసం అమెరికా ఆయుధాల ఖాళీ! మిత్రదేశాల్లో మొదలైన యుద్ధ భయం..?

మొదటి పేజి తరువాయి

పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక ఉన్నతాధికారి తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఆయుధాల కొరత కారణంగా ప్రపంచవ్యాప్తంగా తన రక్షణ బాధ్యతలను అమెరికా సక్రమంగా నిర్వహించగలదా లేదా అనే ఆందోళనలు మొదలయ్యాయి. ఇజ్రాయెల్ రక్షణ కోసం అమెరికా ఏకంగా 200 కంటే ఎక్కువ థాడ్ ఇంటర్సెప్టర్ క్షిపణులను ప్రయోగించింది.తూర్పు మధ్యధరా సముద్రంలో మోహరించిన తన నౌకాదళ నౌకల నుండి 100 కంటే ఎక్కువ స్టాండర్డ్ మిస్సైల్-3 (ాఎ-3), స్టాండర్డ్ మిస్సైల్-6 (ాఎ-6) ఇంటర్సెప్టర్లను లాంచ్ చేసింది.దీనివల్ల అమెరికా వద్ద ఉన్న మొత్తం క్షిపణి నిల్వల్లో దాదాపు సగం ఖాళీ అయిపోయాయి.దీనికి భిన్నంగా ఇజ్రాయెల్ కేవలం 100 కంటే తక్కువ 'ఆరో' ఇంటర్సెప్టర్లను, దాదాపు 90 'డేవిడ్స్ స్లింగ్' ఇంటర్సెప్టర్లను మాత్రమే వాడింది. వీటిలో కొన్నింటిని యెమెన్, లెబనాన్లలోని ఇరాన్ అనుకూల శక్తులు ప్రయోగించిన చిన్నపాటి దాడులను అడ్డుకోవడానికే ఉపయోగించింది. అమెరికా క్షిపణి నిల్వలు సగానికి పడిపోవడంతో జపాన్, దక్షిణ కొరియా వంటి అమెరికా మిత్రదేశాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. ఒకవేళ అకస్మాత్తుగా చైనా లేదా ఉత్తర కొరియాతో ఉద్రిక్తతలు పెరిగితే, తమను రక్షించడానికి అమెరికా వద్ద తగినన్ని క్షిపణులు ఉన్నాయా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. స్టిమ్సన్ సెంటర్ సీనియర్ ఫెలో కెల్లీ గ్రీకో మాట్లాడుతూ.. ఈ గణాంకాలు నిజంగానే దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అమెరికా మిస్సైల్ డిఫెన్స్ భారాన్ని మోస్తుంటే, ఇజ్రాయెల్ తన ఆయుధాలను దాచిపెట్టుకుందని విమర్శించారు. ప్రస్తుతం అమెరికా వద్ద కేవలం 200 థాడ్ ఇంటర్సెప్టర్లు మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటి ఉత్పాదక సామర్థ్యం డిమాండ్ కంటే చాలా నెమ్మదిగా ఉందని ఆమె హెచ్చరించారు.

డోలాయమానంలో ట్రంప్ ప్రభుత్వం

అమెరికా-ఇజ్రాయెల్ భాగస్వామ్యం గురించి బయటకు కనిపించే ప్రచారానికి, క్షేత్రస్థాయిలో ఉన్న అసలు సైనిక భారానికి మధ్య చాలా వ్యత్యాసం ఉందని స్పష్టమవుతోంది. మరోవైపు, ఇజ్రాయెల్ సైన్యం తమ కొన్ని మిస్సైల్ డిఫెన్స్ బ్యాటరీలను నిర్వహణ (రైంటెనెన్స్) కోసం తాత్కాలికంగా మూసివేయడానికి సిద్ధమవుతోంది. ఒకవేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్కు వ్యతిరేకంగా మళ్లీ సైనిక చర్యలకు దిగితే, అమెరికా క్షిపణి నిల్వలపై ఒత్తిడి మరింత తీవ్రమవుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ ఆరోపణలను అమెరికా రక్షణ శాఖ (పెంటగాన్) తోసిపుచ్చింది. ఇజ్రాయెల్, అమెరికాల మధ్య ఆయుధాల వినియోగ సమతుల్యతను పెంటగాన్ సమర్థించింది. పెంటగాన్ ప్రధాన ప్రతినిధి సీన్ పార్నెల్ మాట్లాడుతూ.. "బాలిస్టిక్ మిస్సైల్ ఇంటర్సెప్టర్లు అనేవి కేవలం ఒక వ్యవస్థ మాత్రమే కాదు, అనేక రకాల అధునాతన సాంకేతికతలు కలిసి పనిచేసే ఒక సమగ్ర రక్షణ వలయం" అని పేర్కొన్నారు.'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'లో ఇజ్రాయెల్, అమెరికా దేశాలు రక్షణ భారాన్ని సమానంగా పంచుకున్నాయని, ఈ ఆపరేషన్లో ఇరుదేశాలు యుద్ధ విమానాలు, యాంటీ డ్రోన్ సిస్టమ్స్ వంటి అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సాంకేతికతలను అత్యంత సమర్థవంతంగా ఉపయోగించాయని ఆయన స్పష్టం చేశారు.



# అంతర్‌రాష్ట్ర దొంగలపై రైల్వే స్టేషన్లలో 24 గంటల పోలీసుల నిఘా

హనుమకొండ ప్రతినిధి మే 22 ( వార్త నిర్భయం )

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత కొద్ది రోజులుగా ఇతర రాష్ట్రాలు నుండి ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన నేరగాళ్ళు ఇండ్ల చోరీలతో పాటు, చైన్ స్నాచింగ్ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో నిర్థారణ కావడం, ముఖ్యంగా దేశంలోని అన్ని రాష్ట్రాలను కలుపుతూ కేంద్ర బిందువుగా వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు మారడంతో నేరగాళు ళ్ళ రైలు మార్గాల ద్వారా ఇక్కడికి చేరుకోని పలు చోరీలకు పాల్పడటం, అనంతరం నిందితులు ఇదే రైలు మార్గం ద్వారా తిరిగి వారి స్వస్థలాలకు చేరకుంటున్నారు. ఇలాంటి నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టిన వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అంతర్ రాష్ట్ర దొంగలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపోందించారు. ఇందులో భాగంగా అంతర్‌రాష్ట్ర దొంగలను ముందుగా గుర్తిండం అలాగే చోరీల కట్టడికై రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా క్రైమ్స్ అదనపు డిసిపి బాలస్వామి, సిసిఎస్ ఏసిపి సదయ్య అధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. రెండు బృందాలు చోప్పున వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో విధులు నిర్వహిస్తారు. దేశంలోని వివిధ మార్గాల ద్వారా ముఖ్యంగా ఉత్తర భారత దేశం నుండి వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో అగే రైళ్ళలో ఇక్కడకి చేరుకున్న ప్రయాణికుల్లో ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత ప్రయాణికులను గుర్తించి వారిని, వారి సామగ్రిని సైతం కుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు వారి నుండి పూర్తి వివరాలను సేకరించిన అనంతరం ఈ ప్రత్యేక పోలీస్ బృందం సభ్యులు అనుమానిత వ్యక్తుల సంబంధిత వ్రేలి ముద్రలు,ఫేస్ రికగ్నైజేషన్‌లను పోలీసుల వద్ద వున్న అధునిక పరిజ్ఞానంతో దేశంలోని నేరస్థులకు సంబంధించిన డాటా బెస్‌తో అనుసంధానం చేసి సంబంధిత అనుమానిత వ్యక్తులను పరీక్షంచడం జరుగుతుంది. ఈ తనిఖీల్లో ఒక వేళ తనిఖీ చేసిన వ్యక్తి గతంలో ఏదైన నేరానికి పాల్పడినట్లయితే క్షణాల్లో పోలీసులు



వినియోగిస్తున్న టెక్నికల్ డివైజ్‌కు అనుమానితుడి పూర్తి వివరాలు చేరిపోతాయి. దీనితో తక్షణమే పోలీసులు అప్రమత్తమై సదరు అనుమానితులను అదుపులోకి తీసుకోని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగింది. ఇదే సమయంలో ఈ బృందాలు తనిఖీలు చేసే సయమంలో అనుమానిత పూర్తి వివరాలను సైతం రికార్డుల రూపం భద్రపర్చడం జరుగుతుంది. నలుగురు సభ్యులు వున్న ప్రత్యేక బృందంలో ప్రతి రైల్వే స్టేషన్‌ల్లో షిఫ్టల వారిగా విధులు నిర్వహిస్తు నిరంతరం అనుమానితులను తనిఖీలు నిర్వహిస్తూ అంతరాష్ట్ర దొంగలకు చెక్ పెడుతున్నారు వరంగల్ కమిషనరేట్ పోలీసులు.

# పాలకవర్గం సమస్యలు పరిష్కరించడంలో విఫలం.

**మంచినీరు, సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్లపై ప్రధాన డిమాండ్లు.**

**మున్సిపల్ ఆఫీస్ ఇన్‌ఛార్జికి వినతిపత్రం అందజేత .**

**సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన.**

వనపర్తి బ్యూరో మే 22 (వార్త నిర్భయం)

ఆత్మకూరు మున్సిపల్ పట్టణంలో ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు.సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ ఆఫీస్ ఇన్‌ఛార్జి అశోక్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ సభ్యుడు, కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో దాదాపు 20 వేల జనాభా ఉందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు, అధికారులు విఫలమవుతు న్నారని విమర్శించారు.పట్టణంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టడంలో ప్రభుత్వం, పాలకవర్గం జాప్యం చేస్తోందని, తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మొదటి దఫాలో ప్రభుత్వ నిబంధనల వల్ల చాలా మంది అర్హులు ఇళ్లు నిర్మించుకోలేకపోయారని, కొత్త నిబంధనలతో రెండవ దఫాలో అర్హులైన పేదలకు ఇందిర ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పింఛన్లు కొత్త వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు.గ్యాస్ సబ్సిడీ, ఉచిత విద్యుత్ స్కీమ్ అమలు కావడం లేదని, వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో పార్టీ నాయకులు చెన్నయ్య, శ్రీనివాసులు, రాము, రాములు, భగవంతు, ప్రజలు వెంకటయ్య,



వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

# కుల కార్పొరేషన్లకు పాలక మండళ్లు ఏర్పాటు చేయాలి

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు బీసీ సమాజ్ వినతి**

**కుమ్మరి, బట్రాజ్, సగర కులాల అభివృద్ధికి వినతిపత్రం.**

**మంత్రి సానుకూల స్పందనపై హర్షం**

హైదరాబాద్ మే 22 (వార్త నిర్భయం) బీసీ సమాజ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శు క్రవారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.కుమ్మరుల కార్పొరేషన్.పూర్తి స్థాయి పాలక మండలితో ఏర్పాటు చేయాలి. బట్రాజ్ ఫెడరేషన్ పూర్తి స్థాయిలో నూతన పాలక మండలిని ఏర్పాటు చేయాలి. సగర ఫెడరేషన్ వెంటనే పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి.బీసీ సమాజ్ రాష్ట్ర కమిటీ అభ్యర్థన మేరకు ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కుల వృత్తులను నమ్ముకున్న బీసీ కుటుంబాల అభివృద్ధికి కార్పొరేషన్లు, ఫెడరేషన్లు కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు, బీసీ సమాజ్ యువజన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లూరి అర్జున్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్, రాష్ట్ర కార్యదర్శి బట్టు విజయరాజు తదితరులు పాల్గొన్నారు.



# దళారీ వ్యవస్థ లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**అధికారులు బాధ్యతగా అర్జీలు పరిష్కరించాలి మంత్రి జూపల్లి.**

**దళారీ వ్యవస్థ లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**వనపర్తి కలెక్టరేట్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశం.**

**రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం**

**ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి బ్యూరో మే 22 (వార్త నిర్భయం) ప్రజల అర్జీలను అధికారులు బాధ్యతాయుతంగా సత్వరం పరిష్కరించి న్యాయం చేయాలని, అదే ప్రజాపాలనకు నిజమైన అర్థమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.శుక్రవారం వనపర్తి కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పాల్గొన్నారు. మంకీ జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ దళారీ వ్యవస్థను సమూలంగా లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల అర్జీలపై ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వద్దని సూచించారు. భూభారతికి సంబంధించి రైతుల అర్జీలను శరవేగంగా పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పరిమితులకు లోబడి ఇండ్లు నిర్మించుకోవాలని, లేకుంటే అప్పులపాలయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.విద్య, వైద్యంపై ప్రధాన దృష్టి సారించి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో రూ.8 లక్షల కోట్ల అప్పు చేసిందని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. యువత డ్రగ్స్ వైపు మళ్లకుండా క్రీడలను ప్రోత్సహించాలన్నారు.

**వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి మాట్లాడుతూ**

వనపర్తి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఒకే రోజు లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహ



నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు.జిల్లాలో ప్రజా ప్రభుత్వం వచ్చాక 61,687 మంది రైతులకు రూ.491 కోట్ల రుణమాఫీ, 1,83,839 మంది రైతులకు రూ.140 కోట్ల రైతు భరోసా అందించామన్నారు. కొత్తగా 73,214 రేషన్ కార్డులు, 84,830 మందికి గృహజ్యోతి, 6,094 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. రూ.70 కోట్లతో వనపర్తిలో మంచినీటి పనులు, రూ.47 కోట్లతో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల భవనాలు, రూ.203 కోట్లతో కొత్త జిల్లా ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందన్నారు. యూనియన్ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో రూ.2.5 కోట్ల సీటీ స్కాన్ ఏర్పాటు చేశామని చెప్పారు.16 మంది చిన్నారులకు వినికిడి పరికరాలు, మహిళా సమాఖ్యలకు ఇందిరా మహిళా శక్తి బస్సులు, రైతులకు పచ్చిరొట్ట, జీలుగా విత్తనాలు పంపిణీ చేశారు.జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ గోవర్ధన్ సాగర్, వనపర్తి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత మున్సిపల్ ఛైర్మన్లు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# మున్నేరు-పాలేరు లింక్ కెనాల్‌ను రద్దు చేయాలి.

**గవర్నర్, సీఎంకు గార్ల ప్రజల సమగ్ర నివేదిక**

**జీవో 98 రద్దు కోరుతూ న్యాయవాది విశ్వ జంపాల వినతి.**

**95% మంది ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నారన్న సర్వే ఫలితం..**



మహబూబాబాద్ మే 22 (వార్త నిర్భయం) మహబూబాబాద్ గార్ల మండలంలో ప్రతిపాదించిన "మున్నేరు-పాలేరు లింక్ కెనాల్" ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సమగ్ర ప్రజా నివేదికను గవర్నర్, ముఖ్యమంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది విశ్వ జంపాల ఈ నివేదికను పంపారు జీవో నెం.98, తేది: 17.05.2025 ప్రకారం గార్ల మండలం ముల్కనూరు--దుబ్బగూడెం వద్ద మున్నేరు చెక్‌డ్యామ్ నుంచి ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు నీటిని మళ్లించేందుకు 9.6 కి.మీ. లింక్ కెనాల్ ప్రతిపాదించారు. ప్రారంభ అంచనా రూ.162 కోట్లు కాగా, ప్రస్తుత సవరించిన అంచనా రూ.204 కోట్లకు చేరిందని నివేదికలో పేర్కొన్నారు.స్థానిక ప్రయోజనం శూన్యం:లి ఈ కాలువ వల్ల గార్ల మండలానికి, మహబూబాబాద్ జిల్లాకు ఎలాంటి ప్రయోజనం లేదని, ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందదని నివేదిక తెలిపింది. స్థానిక జల వనరులను ఇతర ప్రాంతాలకు తరలించే ఏకపక్ష ప్రాజెక్టు అని ఆరోపించారు.పర్యావరణ విధ్వంసం: నీటిని మళ్లించడం వల్ల భూగర్భ జల మట్టం పడిపోయి వేలాది ఎకరాలు ఎడారిగా మారతాయని, సారవంతమైన టాప్ సాయిల్ నశిస్తుందని, మున్నేరు పరీవాహక జీవవైవిధ్యం, జలచరాలు అంతరించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.సాంస్కృతిక, సామాజిక ప్రభావం గార్ల మండలం ఐదవ షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతమని, పీసా చట్టం ప్రకారం గ్రామసభ ఆమోదం తీసుకోలేదని, 1/70 చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. ఆదివాసీల పవిత్ర స్థలాలు కాలువలో సమాధి అవుతాయని, తండాలు ముక్కలవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్థిక విధ్వంసం భూములు కోల్పోవడం, నీటి కొరతతో రైతులు, కూలీలు జీవనోపాధి కోల్పోయి వలస బాట పడతారని, ప్రాంతం ఆర్థికంగా దివాళా తీస్తుందని హెచ్చరించారు.పోలీసు అణచివేత భారీ పోలీసు బలగాల పహారాలో, తుపాకుల నీడలో సర్వేలు జరుపుతున్నారని, ఇది రైతులను, మహిళలను మానసిక భయాందోళనలకు గురిచేస్తోందని ఆరోపించారు.ఆన్‌లైన్ సర్వే ఫలితాలు వేదికపై 14.04.2026 నుంచి 15.05.2026 వరకు నిర్వహించిన సర్వేలో మొత్తం 651 ఓట్లకు గాను 95.24% మంది అంటే 620 మంది ప్రాజెక్టును రద్దు చేయాలని ఓటు వేశారని నివేదికలో తెలిపారు. 4.76% మంది మాత్రమే వ్యతిరేకించారు.జీవో నెం.98ని తక్షణమే రద్దు చేయాలి. ఏజెన్సీలో బలవంతపు సర్వేలు ఆపాలి. నీటిని తరలించకుండా ముల్కనూరు వద్ద "మున్నేరు రిజర్వాయర్" నిర్మించి స్థానిక 60 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలి. విశ్వ జంపాల, న్యాయవాది, రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ విద్యావంతుల వేదిక, గార్ల, మహబూబాబాద్ జిల్లా.

# ప్రజాపాలన హామీలన్నీ అమలు చేశాం.

**జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అమలు**

**మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశం**

**కొత్తగా 2 లక్షల పింఛన్లు ఇస్తామని వెల్లడి.**

**దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్.**



మహబూబ్‌నగర్ బ్యూరో మే 22 (వార్త నిర్భయం) ప్రజాపాలనలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) తెలిపారు.శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు రూ.500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్, మహాలక్ష్మి పథకంతో ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామన్నారు.రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, ఇందిరా మహిళాశక్తి కింద మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులకు ఇస్తున్నామని వివరించారు.ప్రభుత్వం త్వరలో జూన్ 2 నుంచి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేయబోతోందని, నూతనంగా 2 లక్షల పింఛన్లు ఇవ్వబోతున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని అధికారులను కోరారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, మహబూబ్‌నగర్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్, ముడా ఛైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, భూత్పూర్ మున్సిపల్ ఛైర్మన్ బాలకోటి, వివిధ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

# రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం.

**కేటీఆర్ నగర్‌కు మహర్దశ**

**సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన కాంగ్రెస్.**

**ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి.**

**పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడి.**





హైదరాబాద్ మే 22 (వార్త నిర్భయం( ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.శుక్రవారం ఉప్పల్ డివిజన్‌లోని కేటీఆర్ నగర్‌లో ఆయన విస్తృతంగా పర్యటించారు. కాలనీ వాసులతో కలిసి రూ.1 కోటి 50 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.ఉప్పల్ డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. కాలనీ వాసులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.నరసింహ, కాంతారావు, నగేష్, శేఖర్, బాలు, తిక్క రెడ్డి, శ్రీనివాస్, చందు, రాధ, రేణుక, పద్మ, శారద, వెంకటమ్మ, రేష్మ, రజియా, ఉపేందర్ రెడ్డి, రత్న రెడ్డి, సత్తిరెడ్డి, రఘు, అలీం, సందీప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

